క్లుప్తంగా

బాధిత కుటుంబానికి సాయం

తొగుట(దుబ్బాక): మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన కురుమ బాల్‌రాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించాడు. విషయం తెలుసుకున్న యువ చైతన్య కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొరిగె నర్సింహ శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి సమితి ఆధ్వర్యంలో సేకరించిన రూ.50వేల సాయం అందజేశారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర కార్యదర్శి కేమిడి సత్యనారాయణ, నాయకులు నరేంద్ర, కనకరాజు, మల్లేశ్, లింగం, కొమురయ్య, సంపత్, కనకయ్య పాల్గొన్నారు.

ఈవీఎంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న రెవెన్యూ అధికారులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని గౌరవెల్లి గ్రామంలో పోలింగ్ కేంద్రాలు 47, 48, 49, 50లోని ప్రజలకు ఈవీఎం ద్వారా ఓటు వేసే విధానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ మండల ఆర్‌ఐ సుహాసిని మాట్లాడుతూ.. ప్రజలందరూ ఓటు వేసే విధానంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఓటు వజ్రాయుధం వంటిదని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ కరీంతో పాటు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

హరితహారానికి సర్వం సిద్ధం చేయాలి



మాట్లాడుతున్న ఏపీడీ కౌసల్యాదేవి

జగదేవ్‌పూర్(గజ్వేల్): హరితహారం కార్యక్రమానికి మొక్కలను సిద్ధం చేయాలని ఏపీడీ కౌసల్యాదేవి అన్నారు. శనివారం మండల కార్యాలయంలోని అధికారులతో హరితహారంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టే హరితహారం కార్యక్రమానికి మొక్కలను సిద్ధం చేయాలని కోరారు. మండలంలో 18వేల మొక్కలను నాటాలని, అందుకు గుంతలను తవ్వి మొక్కలనే నాటేందుకు సిద్ధం చేయాలన్నారు. హరితహారంలో ఉపాధి కూలీలు అందరూ పాల్గొనేలా అధికారులు చూడాలన్నారు. ప్రతి గ్రామాన్ని స్వచ్ఛ, హరితగ్రామాలుగా తీర్చిదిద్దాలని, అందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌వర్మ, ఏపీఓ లక్ష్మీ, ఈజీఎస్ సిబ్బంది రాజు, కరుణాకర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, నరేశ్, సందీప్ పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం ఆండాళ్ తిరునక్షత్రోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయంలో ప్రధాన అర్చకులు శేషాచార్యులు, రాజు స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకుడు శేషాచార్యులు మాట్లాడుతూ.. గోదాదేవి జన్మదినోత్సవ వేడుకల సందర్భంగా అమ్మవారికి ప్రభాత వేళ మంగళస్నానం, అభిషేకం, అర్చన, ద్రావిడ ప్రబంధ సేవాకాలం, ముప్పై పాశురాల విన్నపం పూజలు నిర్వహించారు.

స్వచ్ఛ సిద్దిపేటగా మార్చుదాం

సిద్దిపేటజోన్: సమష్టిగా పనిచేసి స్వచ్ఛ సిద్దిపేటగా మార్చుదామని మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు అన్నారు. శనివారం పట్టణంలోని 28వ వార్డులో నడకతో చెత్త ఏరుదాం, చెత్త ఏరివేద్దాం అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులో ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. చెత్త ప్రాముఖ్యతపై వివరించారు. వార్డులో తిరుగుతున్న క్రమంలో బీహార్ వలస కూలీలకు పరిశుభ్రత, ఆరుబయట చెత్త వేయొద్దని, పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. వారితో ప్రమాణం చేయించారు. వార్డులో ఉన్న హోటల్ యజమానులతో మాట్లాడి ప్లాస్టిక్ టీ కప్‌లను వాడొద్దని సూచించారు. ఈ సందర్భంగా వర్షాల కారణంగా మంత్రి హరీశ్‌రావు వీధి వ్యాపారులకు ఉచితంగా ఇచ్చిన గొడుగులను పట్టణ అధ్యక్షుడు సంపత్‌రెడ్డితో కలసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, ఆర్టీఏ సభ్యుడు ఈర్షద్, కౌన్సిలర్లు తిరుమల్, మోహిజ్, సుందర్, రఘురాం, లక్ష్మణ్, విఠోభ, శ్రీనివాస్ యాదవ్, ఆనంద్, రవి, మల్లికార్జున్, నాగరాజు, వజీర్ పాల్గొన్నారు.

తండా రోడ్లతో తంటా



గండిపల్లి గ్రామ పరిధిలోని బోరింగ్‌తండా, సరిరాంతండాలకు వెళ్లే రోడ్డు



జలమయంగా మారిన మైసమ్మవాగుతండా గ్రామానికి వెళ్లే రోడ్డు

- చినుకు పడితే చిత్తడిగా మారుతున్న వైనం
- ఇబ్బంది పడుతున్న తండావాసులు
- పట్టించుకునే నాథుడు కరువు

అక్కన్నపేట(హుస్నాబాద్): స్వాతంత్య్రం వచ్చి ఏళ్లు గడుస్తున్నా గిరిజన తండాల ప్రజలు మౌలిక సౌకర్యాలు, రోడ్లు మరమ్మతులకు నోచుకోవడం లేదు. మట్టిరోడ్లే దిక్కుగా మారుతున్నాయి. తండా రోడ్లకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో బీటీ రోడ్లకు నోచుకోవడం లేదు. దీనికి ఉదాహరణే అక్కన్నపేట మండలం గండిపల్లి గ్రామ పరిధిలోని పంచరాయితండా, బోరింగ్‌తండా, సరిరాంతండాలతో పాటు మైసమ్మవాగుతండా గ్రామం, అదేవిధంగా చాపగానీతండా గ్రామ పరిధిలోని ఫన్యానాయక్‌తండాలకు కనీసం మౌలిక వసతులతో పాటు రోడ్ల దుస్థితి మరీ అధ్వానంగా తయారైంది. ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తండా రోడ్లన్నీ బురదమయంగా మారాయి. దీంతో గిరిజనులు భయం భయంతో ప్రయాణిస్తున్నారు. మట్టిరోడ్డుపై నడకదారిన వెళ్తే జారీ పడిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏటా వర్షాకాలం వస్తే చాలు అధ్వానంగా మారి కాలినడక కూడా కష్టతరంగా ఉంటుందని తండావాసులు చెబుతున్నారు. ఏళ్లుగా ఇదే గోస అంటూ పలువురు తండావాసులు వాపోతున్నారు. మట్టిరోడ్లను బీటీగా మార్చాలని అనేకసార్లు స్థానిక ప్రజాప్రతినిధులకు, ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదని అంటున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ దృష్టి సారించి ఏళ్లనాటి రోడ్ల సమస్యను పరిష్కరించి తారురోడ్లు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని తండావాసులు కోరుతున్నారు.

ఏకత్రింశత్ వార్షికోత్సవానికి ఏర్పాట్లు



అమ్మవారికి పత్రిక అందిస్తున్న ఆలయ చైర్మన్ తదితరులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని సంతోషీ మాత ఆలయంలో శ్రావణమాసంలో నిర్వహించే ఏకత్రింశత్ వార్షికోత్సవానికి అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ మాంకాల నవీన్‌కుమార్ అన్నారు. శనివారం ఆలయంలో వార్షికోత్సవ పత్రికను అమ్మవారికి అందించారు. ఈ సందర్భంగా నవీన్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం నిర్వహించిన విధంగానే ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా, అందరూ సంతోషంగా అమ్మవారిని దర్శించుకునే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి విశ్వనాథశర్మ, ఏకత్రింశత్ వార్షికోత్సవ వైదిక నిర్వాహకులు బ్రహ్మశ్రీ ఉమాపతి రామేశ్వరశర్మ, ఆలయ అర్చకులు పాడిచేటి రామకృష్ణమాచారి, ఎక్స్‌అఫీషియో సభ్యులు శాఖం మధుసూదన్ రావు, ఆలయ మాజీ చైర్మన్‌లు బండిపల్లి కిష్టయ్య, కాచం కాశీనాథ్, ధర్మకర్తలు గాదగోని సత్యంగౌడ్, కాముని ప్రభాకర్, చకిలం అమర్, గరిపల్లి సువర్ణ, కొమురవెల్లి కల్యాణి, ఆలయ సిబ్బంది శంకర్, వాసు, సహా అర్చకులు సాయి, విజయ్, ఆలయ మాజీ ధర్మకర్త మాధురి, వార్డు కౌన్సిలర్ దీప్తినాగరాజు, భక్తులు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీఐ కృష్ణమూర్తికి సీపీ అభినందన



సీఐ కృష్ణమూర్తిని అభినందిస్తున్న సీపీ

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్ ఎస్‌ఐగా పనిచేస్తున్న కృష్ణమూర్తి సీఐగా పదోన్నతి పొందారు. శనివారం సీపీ కార్యాలయంలో సీపీ శ్వేతను కృష్ణమూర్తి మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందించారు. సీపీ చేతుల మీదుగా మూడు నక్షత్రాలను అలంకరించడంతో పాటు పదోన్నతి పొందిన కృష్ణమూర్తితో పాటు అధికారులను అభినందించారు. బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తూ మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీగా ప్రసన్నకుమార్

సిద్దిపేటకమాన్: సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీగా వి.ప్రసన్నకుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు పోలీసు కమిషనర్ కార్యాలయంలో సీపీ శ్వేతను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ప్రసన్నకుమార్ 1998లో ఎస్‌ఐగా పోలీసు శాఖలో చేరి రంగారెడ్డి, హైదరాబాద్ ప్రాంతాల్లో విధులు నిర్వహించారు. గతంలో సిద్దిపేట రూరల్, కుకునూర్‌పల్లి, మాదాపూర్, శంకర్‌పల్లి సీఐగా పని చేశారు. ఈ ఏడాది పదోన్నతి పొంది సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా సీపీ అభినందించారు.

గజ్వేల్ రూరల్ సర్కిల్ సీఐగా జానకీరాంరెడ్డి

వర్గల్(గజ్వేల్): గజ్వేల్ రూరల్ సర్కిల్ సీఐగా జానకీరాంరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. సిద్దిపేట రూరల్ సర్కిల్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ కమిషనర్ శ్వేతను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. గజ్వేల్ రూరల్ సర్కిల్ పరిధిలో శాంతి భద్రతలకు భంగం వాటిల్లకుండా, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించాలని సీపీ సూచించారు.

ఆరోగ్య పరిరక్షణలో భాగమే రుతుప్రేమ



మాట్లాడుతున్న మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు

సిద్దిపేటజోన్: మహిళల నెలసరి ఆరోగ్యంతో పాటు హానికర చెత్త నివారణ కోసం రుతుప్రేమ కార్యక్రమాన్ని సిద్దిపేటలో చేపడుతున్నట్లు మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు అన్నారు. కమిషనర్ సంపత్ కుమార్, ప్రముఖ పర్యావరణ వేత్త డా.శాంతి, మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజులతో కలిసి 27, 28వ వార్డు మహిళలకు పట్టణంలోని దర్గా ఫంక్షన్ హాల్‌లో శనివారం రుతుప్రేమపై అవగాహన కల్పించారు. శానిటరీ ప్యాడ్స్ వాడటంతో మహిళలు అనేక రకాలుగా ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని, క్లాత్ ప్యాడ్‌లు వినియోగించాలని వారు కోరారు. మంత్రి హరీశ్‌రావు దేశంలో ఎక్కడా లేనటువంటి విధంగా కేవలం మన సిద్దిపేటలోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మల్లికార్జున్, నద్ది నాగరాజురెడ్డి, బందారం శ్రీలతరాజు, నాయకం లక్ష్మణ్, గుండ్ల యోగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు

హరితహారంలో దుబ్బాకను ఆదర్శంగా నిలుపుదాం

మున్సిపల్ కమిషనర్ గణేశ్‌రెడ్డి



మొక్కలను పరిశీలిస్తున్న కమిషనర్ గణేశ్‌రెడ్డి

దుబ్బాకటౌన్: హరితహారం కార్యక్రమంలో దుబ్బాక మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుపుదామని కమిషనర్ పాతేరి గణేశ్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని డబుల్ బెడ్రూంలకు వెళ్లే రహదారికి ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలు సంమృద్ధిగా నాటితేనే అవి పెరిగి వృక్షాలుగా మారి వాతావరణ సమతుల్యతను కాపాడతాయన్నారు. మానవ మనుగడలో చెట్లు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో అన్ని వార్డుల్లో విరివిగా మొక్కలు నాటుతామన్నారు. హరితహారం కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థలు అన్ని వర్గాల ప్రజలు పాలు పంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

రచనలతో నిజాం పాలనపై పోరాటం

బాలసాహితీవేత్త రాజేశం



దాశరథి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కవులు, రచయితలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ ప్రజల కన్నీళ్లను రచనలుగా మలిచి, నిజాం నిరంకుశ పాలనపై పోరాటం చేసిన కవి దాశరథి కృష్ణమాచార్యులు అని బాలసాహితీవేత్త ఉండ్రాళ్ళ రాజేశం అన్నారు. శనివారం సిద్దిపేటలో దాశరథి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం రాజేశం మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో దివిటీగా నిలిచి, పద్యాన్ని పదునైన ఆయుధంగా చేసుకొని ప్రజా చైతన్యమై సాగిన దాశరథి కష్ణమాచార్య స్ఫూర్తితో నేటి రచయితలు ముందుకు సాగాలన్నారు. అగ్నిధార, రుద్రవీణ, తిమిరంలో సమరం, గాలీబ్ గీతాలు, రచనలతో పాటు సినిమా పాటలు సైతం రాసి ప్రజల గుండెల్లో నిలిచారన్నారు. కార్యక్రమంలో కవి, గాయకులు వరుకోలు లక్ష్మయ్య, బస్వ రాజ్ కుమార్, కోణం పర్శరాములు, పెందోట వెంకటేశ్వర్లు, మిట్టపల్లి పరశురాములు, శ్రీచరణ్ సాయి దాస్ పాల్గొన్నారు.

పాత వస్తువులను ‘ట్రిపుల్‌ఆర్’కు ఇవ్వండి

హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత



సెంటర్‌కు పాత వస్తువులు అందజేస్తున్న కాలనీవాసులు

హుస్నాబాద్: ఇంట్లో ఉండే పనికిరాని వస్తువులను ట్రిపుల్‌ఆర్ సెంటర్‌కు ఇవ్వాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. పట్టణంలోని 2వ వార్డులో శనివారం ట్రిపుల్‌ఆర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ రజిత మాట్లాడుతూ.. ఇంట్లో చాలా కాలంగా మీకు ఉపయోగపడకుండా, ఇతరులకు ఉపయోగపడే పాల బొమ్మలు, ప్లాస్టిక్ వస్తువులు, పాత పుస్తకాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, పాత బట్టలు ఇలా పాత వస్తువులను ట్రిపుల్‌ఆర్ సెంటర్‌కు అందించాలన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, కౌన్సిలర్ బోజు రమా, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ రవికుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు వెంటనే పరిష్కరించాలి

దుబ్బాక: విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన చేర్యాలలో చేపట్టిన సైకిల్‌యాత్ర శనివారం దుబ్బాకకు చేరింది. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా ఐద్వా అధ్యక్షురాలు నవీన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ మాట్లాడుతూ.. సంక్షేమ హాస్టల్‌లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దుబ్బాక పట్టణంలో పీజీ, పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేయాలన్నారు. బీసీ, మైనార్టీ హాస్టళ్లకు సొంత భవనాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, విద్యార్థులకు కాస్మొటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. మన ఊరు మనబడి పేరుతో గొప్పలు చెప్పుకునే రాష్ట్ర ప్రభుత్వం హాస్టల్‌లో విద్యార్థులకు కనీస అవసరాలు తీర్చడంలేదంటూ మండిపడ్డారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు అరవింద్, ఉపాధ్యక్షుడు సాదిక్, నాయకులు సంజీవ్, ప్రశాంత్, స్వామి, శేఖర్ ఉన్నారు.

యువతకు లెర్నింగ్ లైసెన్సులు అందజేత



లెర్నింగ్ లైసెన్సు పొందిన యువకులతో అంజయ్య తదితరులు

చేర్యాల(సిద్దిపేట): నియోజకవర్గ పరిధిలో 18 సంవత్సరాలు నిండి డ్రైవింగ్ వచ్చిన యువతకు ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఉచితంగా డ్రైవింగ్ లైసెన్సు ఇప్పిస్తున్నారు. అందులో భాగంగా పట్టణ కేంద్రంతో పాటు మండల పరిధిలో ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకున్న యువకులకు శనివారం ఆర్టీఏ కార్యాలయ ఆవరణలో లెర్నింగ్ లైసెన్సులు అందజేశారు. ఈ సందర్భంగా యూత్ 4 మండలాల ఇంచార్జీ శివగారి అంజయ్య మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, నియోజకవర్గ కో–ఆర్డినేటర్ గుజ్జ సంపత్‌రెడ్డిల సూచనల మేరకు యువత యువకుల నుంచి డ్రైవింగ్ లైసెన్సుల కోసం దరఖాస్తులు తీసుకున్నామన్నారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నవీన్‌రెడ్డి, నాయకులు రాజు, రాము, మహేశ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

68 మందికి..

దుబ్బాకటౌన్: దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు కల్పిస్తున్న ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ ప్రక్రియలో భాగంగా శనివారం 68 మంది యువతీ, యువకులకు లెర్నింగ్ లైసెన్స్‌లు అందించామని బీజేపీ నాయకులు సుంకోజి ప్రవీణ్ తెలిపారు. సిద్దిపేట ఆర్టీఓ కార్యాలయంలో దుబ్బాక మండలంలోని పోతారం, ఆరెపల్లి, చీకోడ్, అప్పనపల్లి, పద్మనాభునిపల్లి గ్రామాలకు చెందిన వాహనదారులకు అందజేశామని తెలిపారు.

ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకు రావాలి

హుస్నాబాద్: పట్టణంలోని శ్రీ కేశవ ఆలయ నిర్మాణ స్థలం వద్ద శనివారం ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు వరయోగుల మురళీధర్‌స్వామి మాట్లాడుతూ.. 100 సంవత్సరాల క్రితం పట్టణంలో శివ కేశవాలయాలు ఉండేవని, అవి శిథిలావస్థకు చేరుకోగా శివాలయం స్థలంలోనే శివాలయాలు నిర్మించి లింగాన్ని ప్రతిష్ఠించారని తెలిపారు. కాగా పాత కేశవ ఆలయం స్థలంలో నిర్మాణం చేపట్టలేదన్నారు. పట్టణ వైష్ణవ సంఘం ఆధ్వర్యంలో పాత స్థలంలోనే కేశవ ఆలయ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించామన్నారు. ఆలయ నిర్మాణం కోసం దాతలు ముందుకు వచ్చి విరాళాలు ఇవ్వాలని, ఇందుకు ప్రజలందరి సహకారం ఉండాలని మురళీధర్ స్వామి కోరాడు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, కౌన్సిలర్ రాజు, నాయకులు సుదర్శనస్వామి, శంకర్, అనంతస్వామి, మల్లికార్జున్‌రెడ్డి, వాసుదేవశర్మ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

సిద్దిపేటకమాన్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు అన్నారు. సిద్దిపేట యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయం, గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ప్లాంటేషన్ ఆఫ్ ట్రీస్ ఫర్ గ్రీనర్ ఎర్త్ అనే నినాదంతో పట్టణంలో శనివారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజనర్సు మాట్లాడుతూ.. మంత్రి హరీశ్‌రావు కృషితో సిద్దిపేటలో ప్లాస్టిక్‌ని పూర్తిగా నిర్మూలించి స్టీల్ బ్యాంక్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. యువత తమ పుట్టినరోజుల్లో మొక్కను బాధ్యతగా నాటాలని సూచించారు.

◆ కార్యకర్తలకు అండగా నిలుస్తాం

మిరుదొడ్డి(దుబ్బాక): కార్యకర్తలు అధైర్యపడొద్దని, ప్రతీ కార్యకర్తకు అండగా నిలుస్తామని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మామిడి మోహన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన మిరుదొడ్డిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఎర్రోళ్ల రేణుకా కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. కాగా రోడ్డు ప్రమాదంలో ఇటీవల తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతున్న బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కూచిగారి భూమరాజయ్య, మొగుళ్ల ఐలయ్యలను పరామర్శించారు. ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున ఆర్థికసాయం అందించారు.

◆ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్స్

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 28న స్పాట్ అడ్మిషన్లు తీసుకోనున్నట్లు ప్రిన్సిపాల్ సతీశ్ శనివారం తెలిపారు. అర్హత గల విద్యార్థులు ఈ నెల 25 నుంచి 27 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 28న ఉదయం 9 గంటల నుంచి స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో పాటు టీసీతో హాజరుకావాలని చెప్పారు. అడ్మిషన్ ఫీజు రూ.6,180లు వెంట తెచ్చుకోవాలని, ఈఈఈ, సివిల్ బ్రాంచిల్లో ఖాళీ సీట్ల వివరాలకు సెల్ నం 9440010846 ఫోన్‌చేసి తెలుసుకోచ్చని పేర్కొన్నారు.

◆ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి

మద్దూరు(హుస్నాబాద్): గ్రామ పంచాయతీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మె 17వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇన్ని రోజులుగా సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం చాలా బాధాకరమన్నారు. నిరంతరం గ్రామాల్లో శ్రమిస్తున్న తమను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల గ్రామ పంచాయతీ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

◆ సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

కొమురవెల్లి(సిద్దిపేట): సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం లాంటిదని కొమురవెల్లి మల్లన్న ఆలయ చైర్మన్ గీస భిక్షపతి అన్నారు. శనివారం మండల కేంద్రంలో తపాస్‌పల్లి గ్రామానికి చెందిన ఈగ కనకయ్య, కంకనాల కనకయ్య, ములుగు బాలమల్లు, రుద్రారం సాంబయ్యలకు మంజూరైన చెక్కులను ఆయన జెడ్పీటీసీ సిద్ధప్పతో కలసి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తలారి కిషన్, పుట్ట కనకయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

◆ గౌడ కులస్తుల సంక్షేమానికి కృషి చేస్తా

గజ్వేల్‌రూరల్: గౌడ కులస్తుల సంక్షేమానికి కృషి చేస్తానని మండల పరిధిలోని జాలిగామ గ్రామ గౌడ సంఘం అధ్యక్షుడు తాళ్ల శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం గ్రామంలో గౌడ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ గౌడ సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు ఉపాధ్యక్షుడిగా హరికిషన్‌గౌడ్, సభ్యులుగా నర్సవ్వ, చిన్న భూమాగౌడ్, కురుమూర్తిగౌడ్‌లతో కూడిన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భూమాగౌడ్, నర్సింలుగౌడ్, తాళ్ల ఆంజనేయులుగౌడ్, కిష్టాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

◆ పంటల రక్షణపై అవగాహన

జగదేవ్‌పూర్(గజ్వేల్): ప్రస్తుతం అధిక వర్షాలకు పత్తి, మొక్కజొన్న కంది పంటలతో పాటు ఇతర పంటలు దెబ్బతినే అవకాశం ఉన్నందున పంటలను కాపాడుకునేందుకు రైతులు రక్షణ చర్యలు తీసుకోవాలని ఏఓ వసంతరావు సూచించారు. శనివారం మండలంలోని దౌలాపూర్ గ్రామంలో రైతులతో కలిసి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధిక వర్షాలతో పంటలకు నష్టం జరిగే అవకాశం ఉందని, రైతులు పంటల సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పంట పొలాల్లో వర్షం నీరు నిల్వకుండా చూసుకోవాలని కోరారు. అదేవిధంగా వ్యవసాయ అధికారుల సూచనల మేరకు మందులను పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ ఖలీల్, రైతులు పాల్గొన్నారు.

◆ మున్నూరు కాపు చారిటబుల్ ట్రస్ట్ కమిటీ ఎన్నిక

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయం వద్ద నిత్యాన్నదాన సత్రం ఏర్పాటు కోసం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మున్నూరుకాపు చారిటబుల్ ట్రస్ట్ కమిటీని రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు కొండ దేవయ్య ఆధ్వర్యంలో శనివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా పాల సాయిరాం, అధ్యక్షుడిగా తాడెం కృష్ణమూర్తి, కార్యదర్శిగా నాయకం మల్లయ్య, కోశాధికారిగా కొత్త కృష్ణవేణిశ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా పాల లక్ష్మీ నారాయణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో శివశంకర్, తాడెం రంజిత, పిల్లిచంద్రం, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ వేతనాలు పెంచకుంటే సమ్మె ఉధృతం చేస్తాం

సిద్దిపేటకమాన్: ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ల వేతనాలు పెంచాలని, కనీస వేతనం చెల్లించాలని లేదంటే సమ్మె ఉధృతం చేస్తామని ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్లు డిమాండ్ చేశారు. సిద్దిపేట ఆర్టీసీ డిపో ఎదుట రెండోరోజు శనివారం డ్రైవర్లు విధులు బహిష్కరించి సమ్మె నిర్వహించారు. వీరికి సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్, గోపాలస్వామి, శ్రీనివాస్, డ్రైవర్లు నాగయ్య, ఖలీల్, లింగం పాల్గొన్నారు.

◆ ప్రభుత్వ భూమిని కాపాడాలి

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండలంలోని జాలపల్లి గ్రామంలో నూతన నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల స్థలం ఆక్రమణకు గురైందని ఆక్రమణదారుల నుంచి ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ గ్రామానికి చెందిన పలువురు శనివారం తహసీల్దార్ గోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. 2008వ సంవత్సరంలో 3 ఎకరాల 12 గుంటల భూమిని ప్రైవేట్ వ్యక్తుల వద్ద కొనుగోలు చేసి తహసీల్దార్ పేరుపై రిజిస్ట్రేషన్ చేయించినట్లు తెలిపారు. సదరు భూమిని డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం ప్రభుత్వం కేటాయించిందన్నారు. అయితే ఈ భూమిని కొంత మంది ఆక్రమించుకున్నారని, ఆక్రమణకు గురైన భూమిని పూర్తిస్థాయిలో సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని వారు వినతిలో పేర్కొన్నారు.

◆ పంటల వివరాలు నమోదు చేసుకోవాలి

మద్దూరు(హుస్నాబాద్): వర్షాకాలంలో రైతులు సాగు చేసిన పంటల వివరాలను తప్పనిసరిగా వ్యవసాయ అధికారుల వద్ద నమోదు చేసుకోవాలని ఏఈఓ రాకేశ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన పంటల వివరాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటల వివరాలు నమోదు చేసుకోవడంతో రైతులు పండించే పంటలకు ప్రభుత్వం కల్పించే మద్దతు ధరకు విక్రయించుకోవడానికి వీలు ఉంటుందన్నారు. ఇప్పటివరకు పంటల వివరాలు నమోదు చేసుకోని రైతులు ఏఈఓల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు.

◆ ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

నంగునూరు(సిద్దిపేట): ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశంలో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టేలా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధికార ప్రతినిధి దేవులపల్లి రాజేందర్ డిమాండ్ చేశారు. శనివారం నంగునూరులో వారు విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ తరఫున మాదిగలకు జనాభా నిష్పత్తి ప్రకారం అసెంబ్లీ సీట్లు కేటాయించాలన్నారు. అదేవిధంగా డప్పు, చెప్పు కళాకారులకు పెన్షన్, దళిత బంధు, గృహలక్ష్మి పథకం కింద మాదిగలకు ప్రాధాన్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో లింగాల నర్సింలు, రాజనర్సు, గణేశ్, నర్సింహులు, కృష్ణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

◆ ప్రజారక్షణలో ప్రభుత్వాలు విఫలం

సిద్దిపేటజోన్: ప్రజారక్షణలో ప్రభుత్వాలు విఫలం కావడంతో పరిస్థితి విషమంగా ఉందని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. మణిపూర్ సంఘటనను నిరసిస్తూ శనివారం పట్టణంలోని ముస్తాబాద్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు, నాయకులు మజర్, భిక్షపతి, యాదగిరి, రజని, రాశి తదితరులు పాల్గొన్నారు.